క్లుప్తంగా

సూర్య దేవాలయంలో ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి వారిని కర్నూలు మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ దర్శనం చేసుకున్నారు. గురువారం ఆలయానికి వచ్చిన ఆయన గోశాలను సందర్శించి గోమాతలకు గ్రాసం అందించారు. ఆలయ అర్చకులు స్వామి వార్ల తీర్థ ప్రసాదాలను, ఆలయ మొమెంటోను అందించి ఆశీర్వదించారు.

జూనియర్ డాక్టర్ల రక్తదానం

కర్నూలు(హాస్పిటల్): కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ గురువారం జూనియర్ డాక్టర్లు రక్తదానం చేశారు. దాదాపు 40 మంది రక్తదానం చేశారు. అనంతరం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. వీరికి జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి సంఘీభావం ప్రకటిస్తూ దీక్షలో కూర్చున్నారు. కోల్‌కతా కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌కుమార్, నాయకులు మహమ్మద్ మియ్యా, శేషాద్రిరెడ్డి, రామలక్ష్మణ్, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్‌పై అవగాహన సదస్సు

కర్నూలు సిటీ: బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కామర్స్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఎస్‌బీఐ (నంద్యాల రోడ్డులోని బ్రాంచ్)మేనేజర్ రవీంద్ర నాయక్ అన్నారు. గురువారం డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో బ్యాంకింగ్, బ్యాంకింగ్ ఉత్పత్తుల వినియోగంపై కామర్స్ విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..బ్యాంకింగ్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ డి.నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కేజీ గోవిందరెడ్డికి సత్కారం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ.గోవిందరెడ్డిని చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ఘనంగా సత్కరించింది. నటుడు చిరంజీవి జన్మదిన వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో బుధవారం రాత్రి శిల్పారామంలో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి ప్రజాసేవ చేసిన ప్రముఖులను సత్కరించారు. అందులో డాక్టర్ కేజీ.గోవిందరెడ్డిని సినీ నటుడు ఆర్కే సాగర్ సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేజీ. గోవిందరెడ్డి మాట్లాడుతూ యువత రక్తదానం, అవయవదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): మహిళలను వేధించిన కేసులో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని ఎక్స్‌పర్ట్ ఏజెన్సీలో పనిచేస్తున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్లు రవితేజ, ఫిరోజ్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్, సవిల్ సప్లయ్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ, కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం ఆసుపత్రి సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆరోపణలపై చర్యలు తీసుకోకుండా ఆసుపత్రి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

5 లారీల సీజ్

కర్నూలు (టౌన్): అనుమతులు లేకుండా బనగానపల్లె నుంచి మహారాష్ట్రకు డోలమైట్, కంకర తరలిస్తున్న 5 లారీలను గురువారం గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. స్థానిక ఓర్వకల్లు వద్ద లారీలను స్వాధీనం చేసుకొని రెండు లారీలను పాణ్యం పోలీసు స్టేషన్‌కు, ఒక లారీని ఉల్లిందకొండ పోలీసు స్టేషన్‌కు, మరో రెండు లారీలను ఓర్వకల్లు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సరైన ధ్రువపత్రాలు లేకపోవడం, రాయల్టీ పేపర్లు లేకపోవడంతో జరిమానా విధించి మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు గనుల శాఖ, విజిలెన్స్ రాయల్టీ అధికారులు వెల్లడించారు.

రేపు 5కే మారథాన్

కర్నూలు(హాస్పిటల్): జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ నెల 24వ తేదీ ఉదయం 6 గంటలకు ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు కర్నూలులో మారథాన్ 5కే రన్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల కాలేజీ విద్యార్థులు, రెడ్‌రిబ్బన్ క్లబ్ మెంబర్స్ ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీలు పురుషులు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లకు విడివిడిగా నిర్వహిస్తామన్నారు. మొదటి స్థానంలో నిలిచిన విజేతకు రూ.7 వేలు, రెండవ స్థానంలో నిలిచిన వారికి రూ.4 వేలు బహుమతిని ప్రదానం చేస్తామన్నారు. ఈ పోటీలో పాల్గొనేందుకు ఆసక్తిగల విద్యార్థులు వారు చదువుతున్న కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ ప్రోగ్రాం అధికారి వద్ద నుంచి ధ్రువీకరణ పొంది ఉదయం 5 గంటలకు నగరంలోని కోల్స్ కాలేజీ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని పోటీలో పాల్గొనాలని సూచించారు.

బస్టాండులో భద్రత డొల్ల !

- అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిన వైనం
- రెచ్చిపోతున్న జేబు దొంగలు
- మాయమవుతున్న వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కర్నూలు బస్టాండులో బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు

- పత్తికొండకు చెందిన మునలప్ప కుమారుడికి అనారోగ్యంతో ఆసుపత్రిలో చూపించేందుకు కర్నూలుకు వచ్చాడు. బస్టాండ్‌లో అతడి జేబులోని రూ.27 వేలను ఓ దొంగ నొక్కేసాడు. పక్కా ఆధారాలతో దొంగను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు.
- ఆళ్లగడ్డకు చెందిన పత్తి వ్యాపారి బస్టాండులో బస్సు దిగుతుండగా జేబుదొంగ చేతివాటం ప్రదర్శించి అండర్‌వేర్‌లో ఉంచుకున్న రూ.45 వేలను కొట్టేశాడు.
- నెల రోజుల క్రితం నెల్లిబండకు చెందిన రైతు పంట ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించి బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా జేబు దొంగ చేతివాటం ప్రదర్శించి రూ.1.10 లక్షలు కొట్టేశాడు.
- సిద్ధాపురం గ్రామానికి చెందిన మహిళా దొంగ బస్టాండ్‌లో గొలుసు దొంగతనానికి పాల్పడగా ప్రయాణికులే పోలీసులకు పట్టించారు. ఇలా బస్టాండ్‌ను అడ్డాగా చేసుకుని జేబు దొంగలు రెచ్చిపోతున్నారు. రోజుకు రెండు మూడు దొంగతనాలు జరుగుతున్నప్పటికీ నెలలో రెండు మూడు మాత్రమే పోలీసుల దృష్టికి వస్తున్నాయి. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రయాణికులు సొమ్ము, నగలు పోగొట్టుకున్నప్పటికీ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసే పరిస్థితి లేక వెళ్లిపోతున్నారు.

అతిపెద్ద బస్టాండ్లలో ఒకటి

కర్నూలు: రాష్ట్రంలో అతిపెద్ద బస్టాండ్లలో కర్నూలు ఒకటి. బస్టాండ్ పరిధిలో కర్నూలు-1, కర్నూలు-2 డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 250 వరకు బస్సులు ఉన్నాయి. బస్టాండ్ లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ పర్యవేక్షణ కొరవడి పనిచేయడం లేదు. కొన్ని నిఘా నేత్రాలకు సంబంధించి తీగలు తెగిపోగా మరికొన్ని పాడైపోయి బాగు చేయించడం లేదనే విమర్శలు ఉన్నాయి. నేర ఘటన జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయి. సీసీ ఫుటేజీల ఆధారంగా పలు కేసుల్లో పోలీసులు గతంలో నిందితులను పట్టుకున్నారు. రోజుకు లక్షకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే కర్నూలు బస్టాండ్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు, పోకిరీల బెడద పెరిగింది.

మందు బాబులతో ఇబ్బందులు

హైదరాబాదు, బెంగుళూరు, తిరుపతి, విజయవాడ వెళ్లే ఆదోని, ఎమ్మిగనూరు డిపో బస్సులన్నీ కర్నూలు బస్టాండ్‌కు రావాల్సిందే. అలాగే పొరుగు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా బస్సులు కర్నూలు బస్టాండ్‌కు వస్తుంటాయి. ప్రయాణికుల భద్రత కోసం ముఖద్వారం వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో సీసీ కెమెరాల జాడ కానరావడం లేదు. దీంతో జేబుదొంగల బెడద అధికంగా ఉంది. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో దొంగలు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. సెల్‌ఫోన్లు, విలువైన వస్తువులు, జేబుల్లోని పర్సుల అపహరణకు పూనుకుంటున్నారు. కొందరు మద్యం మత్తులో ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తూ మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రాత్రి సమయంలో ఇక్కడే ఉంటూ వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మంత్రిపైనే ఆశలు

జిల్లాకు మంత్రిగా టీజీ భరత్ ఉండటంతో బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తే కొత్త నిఘా నేత్రాలను బిగించడానికి, ఉన్నవాటిని మరమ్మతులు చేయించటానికి అవసరమైన నిధులు కేటాయించే అవకాశముంటుంది. వీటి పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది కూడా నిత్యం బస్టాండ్‌లో ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో పొరుగు సేవల సెక్యూరిటీ సిబ్బంది ఉండగా ఆ సంఖ్య కూడా తగ్గినట్లు సమాచారం.

కొరవడిన భద్రత

కర్నూలు బస్టాండ్ వద్ద తగిన భద్రత కరువవుతోంది. బస్సు సర్వీసుల విచారణ కోసమో, టిక్కెట్ రిజర్వేషన్ కోసమో ద్విచక్ర వాహనాన్ని కాసేపు అక్కడి ఆవరణలో నిలిపితే చాలు.. ఆ కాస్త వ్యవధిలోనే దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరుకు వెళ్లేందుకు టిక్కెట్ రిజిస్ట్రేషన్ కోసం బస్టాండ్‌కు రాగా మాటు వేసిన దొంగలు ఆయన ద్విచక్ర వాహనాన్ని తస్కరించారు. రోజుకు సుమారు రూ.60 లక్షలకు పైగా సంస్థకు ఆదాయం సమకూరుతున్నప్పటికీ ఇక్కడికి వచ్చే ప్రయాణికుల వస్తువుల విషయంలో రక్షణ కరువవుతోంది. పోలీసు ఔట్‌పోస్టు ఉన్నప్పటికీ నామమాత్రమేనని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్ బయటి వైపు ఔట్ పోస్టు పోలీసులు దృష్టి సారించడం లేదు. దొంగలు ఇక్కడ తిష్ట వేసి బస్సుల్లో సైతం చోరీలకు పాల్పడుతున్నారు. ప్లాట్‌ఫారంపై ప్రయాణికుల దృష్టి మరల్చి విలువైన ఆభరణాలు కాజేస్తున్నారు. మందుబాబులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఉదంతాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. రాత్రివేళల్లో మందుబాబులు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోనే చక్కర్లు కొడుతుంటారు. వ్యభిచార ముఠాలు కూడా పగలు, రాత్రి తేడా లేకుండా సంచరిస్తుంటాయి.

ఆకతాయిల వేధింపులు....

సార్, మేము దూర ప్రాంతాల నుంచి వచ్చాం. మా ఊరి బస్సు వెళ్లిపోయింది. ఉదయం వెళ్లాలి. బయటకు ఎక్కడకు వెళ్తాంలే అని బస్టాండ్‌లోనే వేచి ఉన్నాం. అర్ధరాత్రి తర్వాత కొందరు ఆకతాయిలు వచ్చి మమ్మల్ని నిద్ర లేపి ఇబ్బందులకు గురిచేశారు. బయటకు చెప్పుకోలేని రీతిలో చెడుగా మాట్లాడారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశాం. ఇది ఏ ఒక్కరిదో కాదు.. చాలామంది బస్టాండ్‌లో ఈ తరహా అనుభవాలను ఎదుర్కొంటున్నారు. ప్రాంగణంలో రక్షణగా ఉండాల్సిన పోలీసు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో బహిరంగంగా కొందరు వ్యభిచారులు కూడా బస్టాండ్ చుట్టుపక్కల సంచరిస్తుండడం ఆకతాయిల ఆగడాలకు కలిసొస్తుందని ప్రయాణికుల నుంచి తరచూ ఫిర్యాదులు అందుతున్నా పట్టింపు కరువయ్యింది. బస్టాండ్ చుట్టూ ఉన్న హోటళ్లు, బీడీ బంకులు, టీ స్టాళ్లు అర్ధరాత్రి సమయంలోనూ తెరిచి ఉంచుతుండటంతో మందు బాబులు, పోకిరీలు, వ్యభిచారులకు బస్టాండ్ అడ్డాగా మారిందని ప్రయాణికులు మండిపడుతున్నారు.

గాయపడిన కార్మికుడి మృతి

కర్నూలు: కర్నూలు పాతబస్తీకి చెందిన షేక్ జమీల్ అహ్మద్ (30) కల్యాణ మండపం పైనుంచి పడి తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. కర్నూలు ఖడక్‌పురలో నివాసముంటున్న షేక్ జమీల్ అహ్మద్ వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 20న కోడుమూరు రోడ్డులోని కింగ్ ప్యాలెస్ గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో పాత రేకులు తొలగించి కొత్త రేకులు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక గురువారం మృతిచెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైన్‌స్నాచర్ హల్‌చల్

కర్నూలు శివారులోని బాలాజీ నగర్‌లో నివాసముంటున్న రత్నమ్మ మరో మహిళతో కలిసి గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్తుండగా గొలుసు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఇద్దరు గుర్తు తెలియని యువకులు రత్నమ్మ వెళ్తున్న వాహనాన్ని సమీపించి మెడలో ఉన్న పుస్తెల గొలుసును తెంపారు. ఆమె అప్రమత్తమై దొంగ చేతిలో ఉన్న చైన్‌ను తిరిగి లాక్కుని దొంగ అని కేకలు వేయడంతో వాహన వేగం పెంచి పరారయ్యారు. ఫిర్యాదు అందుకున్న తాలూకా పోలీసులు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు.

దొంగను పట్టించిన మున్సిపల్ కార్మికులు

కర్నూలు: స్థానిక శ్రీరాం నగర్ క్వార్టర్స్‌లో సత్యవేదమ్మ ఒంటరిగా నివాసముంటున్నారు. గురువారం మున్సిపల్ కార్మికులు ఆ ఇంటి సమీపంలోనే క్లీన్ చేస్తుండగా గుర్తు తెలియని యువకుడు సత్యవేదమ్మ ఇంట్లోకి ప్రవేశించి సెల్‌ఫోన్ తస్కరించి పారిపోతుండగా శానిటేషన్ సెక్రటరీ ప్రణీత, మేస్త్రీ సురేష్, స్వీపర్ శిరీష కలిసి దొంగను పట్టుకున్నారు. అతను జొహరాపురం గ్రామానికి చెందిన వీరేష్‌గా గుర్తించి పోలీసులకు పట్టించారు. మూడవ పట్టణ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దొంగను పట్టించిన మున్సిపల్ కార్మికులను వార్డు ప్రజలు అభినందించారు.

అమ్మ పేరిట మొక్కలు నాటండి



మొక్కను నాటుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ అమ్మ పేరిట మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. ఆయన గురువారం ఉదయం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో తల్లి పేరిట మామిడి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏక్ పేడ్ మా కే నామ్ అనే నినాదంతో జాతీయస్థాయిలో ప్రారంభించి సెప్టెంబర్ 2024 నాటికి 80 కోట్ల మొక్కలు, మార్చి 2025 నాటికి 140 కోట్ల మొక్కలను నాటే కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఈ రోజు లక్ష మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. మొక్కలు నాటి తరువాత సంబంధిత ఫొటోలను మేరీ లైఫ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం

కర్నూలు (సెంట్రల్): కలెక్టరేట్‌లో అపరిశుభ్రంగా ఉండటంపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో కలెక్టరేట్‌ను ఆధునికీకరించారు. అయితే ఆయా శాఖలకు చెందిన హెచ్‌ఓడీలు పారిశుద్ధ్యంపై పట్టించుకోవడం లేదు. దీనిపై ఇటీవల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గురువారం కలెక్టరేట్ పరిసరాలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. మున్ముందు ఏ శాఖ కార్యాలయం వద్ద అపరిశుభ్రంగా ఉంటే ఆ శాఖ అధికారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

చోరీలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు?

- సెక్యూరిటీ గార్డులపై సూపరింటెండెంట్ ఆగ్రహం



క్యాజువాలిటీలో రోగి వివరాలు తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజూ దొంగతనాలు జరుగుతున్నా కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డులు ఏం చేస్తున్నారని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ ఏజెన్సీకి మెమో జారీ చేయాలని ఆదేశించారు. ఆయన గురువారం ఆసుపత్రిలోని పలు విభాగాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రిలో డ్రైనేజీ మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించాలని ఏపీఎంఎస్‌ఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు. జనరల్ సర్జరీ విభాగంలోని రోగుల బాత్‌రూమ్‌లు, టైల్స్ మరమ్మతుల పనులను గురించి ఆరా తీశారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య చర్యలను హెల్త్ ఇన్‌స్పెక్టర్లు ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ వద్ద వాటర్ ప్లాంట్ మరమ్మతులను పూర్తి చేయాలన్నారు. రేడియాలజీ విభాగంలో రోగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

సెబీ చీఫ్ రాజీనామా చేయాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సెబీ చీఫ్ మాధురి పురిబచ్ వెంటనే రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు డిమాండ్ చేశారు. గురువారం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెబీ చీఫ్‌కు ఆదానీ కంపెనీల్లో వాటా ఉందని హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయన తక్షణమే రాజీనామా చేయాలన్నారు. ఈ వ్యవహారంపై తక్షణమే సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ) వేయాలని డిమాండ్ చేశారు. ఇది స్టాక్‌మార్కెట్లలో అతిపెద్ద కుంభకోణమన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, నాయకులు రమేష్‌యాదవ్, షేక్‌జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్



నిబంధనలకు విరుద్ధంగా ఆటో అద్దానికి వేసిన స్టిక్కర్

కర్నూలు: నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఆటోలు, ద్విచక్ర వాహనదారులపై ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలోని ప్రధాన రహదారుల్లో తనిఖీలు నిర్వహించారు. వాహన అద్దాలకు స్టిక్కర్లు అతికించుకుని తిపుతున్న 20 ఆటోలను స్వాధీనం చేసుకుని స్టిక్కర్లను తొలగింపజేశారు. అద్దాలకు సినిమా హీరోలు, ఇతర స్టిక్కర్లు అతికించడం వల్ల ముందు వెళ్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే ప్రమాదముందని, అలాంటి వాటిపై నిఘా వేసి మొదటి విడత కింద 20 మంది ఆటోవాలాలకు స్వల్ప అపరాధ రుసుం విధించి హెచ్చరించి పంపారు. ఇకపై ఆటోలకు స్టిక్కర్లు అతికిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ మన్సురుద్దిన్ హెచ్చరించారు.

ఉచితంగా ఎంపీహెచ్‌డబ్ల్యూఓ కోర్సు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన బాలికలకు నగరంలోని ఆదర్శ మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో ఉచితంగా ఏఎన్‌ఎం ఎంపీహెచ్‌డబ్ల్యూఓ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు కరస్పాండెంట్ ఈ పద్మాకర్ గురువారం తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన తమ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్) మొత్తం 40 సీట్లలో 24 సీట్లు ఉచితంగా ప్రవేశం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఫ్రీ సీట్ల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. కోర్సు కాల వ్యవధి రెండు సంవత్సరాలని, కోర్సు పాస్ అయిన వారు మహిళా ఆరోగ్య కార్యకర్తగా ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులన్నారు. అలాగే నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ కూడా చేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కరస్పాండెంట్ ఈ పద్మాకర్ సెల్: 9848352725 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రశ్నాపత్రాల ద్వారా పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు సిటీ: జిల్లాలో ఉన్న సీబీఎస్‌ఈ ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రశ్నాపత్రాల ద్వారా పరీక్షలు నిర్వహించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక డీటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. లక్ష్మారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. 11వ పీఆర్‌సీ, పెండింగ్ డీఏ బకాయిలను చెల్లించాలని కోరారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. నూతన పీఆర్‌సీ ఆలస్యం కానుండడంతో వెంటనే 25 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. 1998, 2008 డీఎస్సీ ద్వారా నియమించిన ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. ఆ సంఘం నాయకులు రత్నం ఏసేపు, సుబ్బరాయుడు, హుస్సేన్, శివ నాగరాజు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి క్వింటా రూ.3,939

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెట్‌లో ఉల్లి ధర క్వింటా రూ.3,939 పలికింది. గురువారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 227 క్వింటాళ్ల దిగుబడిని తెచ్చారు. వ్యాపారులు పోటీమీద సరుకును కొనుగోలు చేశారు. కనిష్ట ధర రూ.3,069, గరిష్ట ధర రూ.3,939 లభించింది. మోడల్ ధర రూ.3,899 పలికింది. రానున్న రోజుల్లో ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



లాంగ్‌జంప్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

కర్నూలు (టౌన్): క్రీడా పోటీల్లో ప్రతిభను చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, కిసాన్‌ఘాట్ వద్ద ఉన్న స్విమ్మింగ్ ఫూల్ వద్ద స్విమ్మింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు మెడల్స్‌తో సత్కరిస్తామన్నారు. అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీలకు మంచి స్పందన వచ్చిందన్నారు. అలాగే స్విమ్మింగ్‌లో పదేళ్లలోపు వారికి, 10 - 12 సంవత్సరాల వారికి 25 మీటర్లు, 50 మీటర్లకు సంబంధించి ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బాస్కెట్‌బాల్, ఖోఖో, ఫెన్సింగ్ పోటీలు

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బాస్కెట్‌బాల్, ఖోఖో, ఫెన్సింగ్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు వెల్లడించారు.

రిటైర్డ్ డ్రైవర్‌కు సత్కారం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన లక్ష్మయ్య అందించిన సేవలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ రెడ్డి అభినందించారు. డ్వామా పీడీ ప్రభుత్వ వాహన డ్రైవర్ లక్ష్మయ్య గత నెల 31న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా గురువారం తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మయ్యను పీడీ, ఇతర డ్వామా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పీడీ అమరనాథ రెడ్డికి జ్ఞాపికను బహుకరించారు. ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా లక్ష్మయ్య నిబద్ధతతో పనిచేశారని ప్రశంసించారు. వాటర్‌షెడ్స్ అదనపు పీడీ మాధవీలత, పరిపాలన అధికారి విజయలక్ష్మి, డ్వామా విజిలెన్స్ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కల్లూరు: కిశోర బాలికలు తప్పకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ఐరన్ అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిని హేమలత సూచించారు. గురువారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వామసముద్రం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడడం వలన రక్త హీనత రాదని చెప్పారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



సి.క్యాంపు రైతుబజారు వద్ద పేరుకుపోయిన చెత్త

కర్నూలు (టౌన్): నగరంలో స్వచ్ఛత అధ్వానంగా మారింది. స్థానిక సి.క్యాంపు రైతుబజార్ సమీపంలో చెత్త చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. రైతుబజార్‌కు రోజూ వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటోంది. సకాలంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్వాసన వస్తోంది. దీంతో ఆ మార్గంలో వెళ్లే స్థానికులు, ద్విచక్ర వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మేస్త్రీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ కొరవడింది. అధికారుల తనిఖీలు లేవు. దీంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బిర్లా ఓపస్ పెయింట్స్ ప్రారంభం



బిర్లా ఓపస్ పెయింట్స్‌ను ప్రారంభిస్తున్న పల్లె ప్రభాకర్ రెడ్డి

కర్నూలు కల్చరల్: శ్రీ తిరుమల ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో బిర్లా ఓపస్ పెయింట్స్ కంపెనీని క్లాస్-1 కాంట్రాక్టర్ పల్లె ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తిరుమల ఎంటర్ ప్రైజెస్ అధినేత సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని అతి పెద్ద కంపెనీల్లో బిర్లా ఓపస్ పెయింటింగ్ ఒకటని, తక్కువ కాలంలో వినియోగదారుల ఆదరణ పొందిందని వివరించారు. సరసమైన ధరకే నాణ్యమైన పెయింట్‌ను వినియోగదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాయలసీమలోనే మొట్టమొదటి ప్రాంచైజీని ప్రారంభించామని, రెండేళ్ల వరకు ఆఫర్ ధర అందుబాటులో ఉంటాయన్నారు. రీజినల్ మేనేజర్ సుమన్‌రెడ్డి మాట్లాడుతూ వాటర్ ప్రూఫింగ్, లగ్జరీ క్యాటగిరీలో పెంయింట్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. మొదటిసారిగా 10 శాతం ఆఫర్‌తో ఫెయింటింగ్‌ను విక్రయిస్తున్నామన్నారు.